

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ నిరసననుద్దేశించి ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీకి నిధుల కేటాయింపు సరిగా లేదన్నారు. రాష్ట్రానికి మరోసారి బిజెపి అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల నేతలు నాగిరెడ్డి గంగారావు, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరపు వెంకటేష్, గుడిమెట్ల వరహాలరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నేతలు

నిరు(ఉ)ద్యోగుల.. ఓ(ఎ)టు..!

- నిరుద్యోగ భృతిపై కూటమి సర్కార్ మౌనంపై తీవ్ర చర్చ
- సూపర్ సిక్స్‌లో తొలి హామీ నిరుద్యోగ భృతినే
- తూర్పు పశ్చిమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలపై 'భృతి' ప్రభావం
- 3.15 లక్షల మంది ఓటర్లలో లక్ష మందికిపైగా నిరుద్యోగులే
- పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్యోగ ఓటర్లు తీవ్ర అసంతృప్తిలోనే
- ఏ మార్పేందుకు రంగంలోకి కూటమి ఎంఎల్‌ఎలు
- రసవత్తరంగా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నిక



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార టిడిపి ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. నియోజకవర్గాలవారీగా ఎంఎల్‌ఎలు, ఎన్నికల పరిశీలకులు సమావేశాలు ఏర్పాటు చేసి కూటమి నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో కీలక ఓటర్లుగా ఉన్న నిరుద్యోగులు, ఉద్యోగులు కూటమి సర్కార్ ఆశలకు గండికొట్టే పరిస్థితి ఉందనే భయం ఆ పార్టీ నాయకులను వెంటాడుతోంది. 2024 మేలో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి మేనిఫెస్టోలో తొలి హామీ నిరుద్యోగులకు రూ.మూడు వేలు భృతి అందించడం. కూటమి సర్కార్ అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతికి సంబంధించి నోరు మెదపలేదు. 2014-19 ఎన్నికల్లో రూ.రెండు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన టిడిపి ఎన్నికలకు ఆరు నెలల ముందు అమల్లోకి తెచ్చి కొద్దిమందికి మాత్రమే ఇచ్చి మమ అనిపించింది. ఇప్పుడు కూడా అదే తరహాలో పాలన ముగిసే సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తుందా అనే అనుమానం నిరుద్యోగుల్లో నెలకొంది. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు ఎటువైపు వేయాలని నిరుద్యోగులు ఆలోచనలో పడ్డారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్ష మందికిపైగా నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. నిరుద్యోగులు పెద్దసంఖ్యలో ఉండటంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఓటెలా అడుగుతారు..?

నిరుద్యోగ భృతి అమలు చేయకుండా, ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా టిడిపి నాయకులు ఓటు ఎలా అడుగుతారు అనే చర్చ క్షేత్రస్థాయిలో నడుస్తోంది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కూటమి తమ శక్తియుక్తులను మొత్తం ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాలవారీగా ఓటర్ల జాబితాలు తీసి ఎంఎల్‌ఎలకు బాధ్యతలు అప్పగిస్తోంది. ఎంఎల్‌ఎల అనుచరగణం ఓటర్లకు ఫోన్లు చేసి ఓటు టిడిపి అభ్యర్థికి వేయాలని కోరుతున్నారు. ఇప్పుడు ఓటు వేస్తే నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహించే అవకాశం ఉందని, ఓటేయకపోతే యువతలో వ్యతిరేకత వచ్చిందనే అభిప్రాయంతో ప్రభుత్వం హామీలు అమలు చేస్తుందనే చర్చ సాగుతోంది. అంతేకాకుండా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు. ఇప్పటి వరకూ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం ఒక్క హామీనీ అమలు చేయలేదు. డిఎలు ఇవ్వడంగాని, సిపిఎస్‌పై నోరు మెదపడంగాని, పిఆర్‌సి కమిటీ ఏర్పాటుపైగాని ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు ఎటువంటి భరోసా దక్కలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలపై ఈ ప్రభావం పెద్దఎత్తున పడే అవకాశం కన్పిస్తోంది. నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లపై టిడిపి లోలోన ఆందోళన చెందుతున్నప్పటికీ బయటకి మాత్రం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది.

టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవుల మధ్య ప్రధాన పోటీ కొనసాగనుందని తెలుస్తోంది. టిడిపి తన అధికార బలంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానాన్ని గెలుచుకోవాలని విశ్వప్రయత్నం చేస్తోంది. పిడిఎఫ్‌కు ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి పెద్దఎత్తున బలం ఉంది. ఇటీవల జరిగిన తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపా ధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి తొలి ఓటుతోనే భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం అందరికీ తెలిసిందే. 2019 మార్చిలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు భారీ మెజార్టీతో గెలిచారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై అధికార పార్టీ ఎంఎల్‌సిలు శాసనమండలిలో మాట్లాడే పరిస్థితి ఎప్పుడూ కనిపించదు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడటం, వారు చేస్తున్న ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనడం సైతం జరుగుతోంది. దీంతో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువగా పిడిఎఫ్ అభ్యర్థులకే ఓటు వేయడం జరుగు తోంది. ఈ ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థి గట్టి పోటీలో ఉన్న పరిస్థితి నెలకొంది. గెలుపెవరిదో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.


కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న అభ్యర్థి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు మరో నామినేషన్

రెండుకు చేరిన నామినేషన్ల సంఖ్య - మీడియా సెంటర్ ఏర్పాటు ఎప్పుడో..?

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మరో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ములకల శ్రీనివాస్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సహాయ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల మూడో తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్ల సంఖ్య రెండుకు చేరింది. ఇప్పటి వరకూ నామినేషన్లు వేసిన వారంతా ఇండిపెండెంట్ అభ్యర్థులే. ఎంఎల్‌సి ఎన్నికల బరిలో నువ్వా..నేనా అంటూ తలపడుతున్న పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు ఇంకా నామినేషన్లు వేయలేదు. ఆరు, ఏడు తేదీల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.


మీడియా సెంటర్ ఏర్పాటు ఉంటుందా?

ఎన్నికల సమాచారం వంటివి అందించేందుకు ప్రతి ఎన్నికల్లో మీడియా సెంటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. ఎన్నికల సంబంధిత అధికారులు అందుబాటులోకి రాకపోతే సమాచారం ఇవ్వడంలో మీడియా సెంటర్ కీలక పాత్ర పోషిస్తోంది. మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తామని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై రెండు రోజులు గడిచిపోయింది. ఇప్పటి వరకూ మీడియా సెంటర్ ఏర్పాటు ఎక్కడా కానరాని పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం పూరిస్థాయిలో మీడియాకు అందని పరిస్థితి ఏర్పడింది. మీడియా సెంటర్ ఏర్పాటు ఉంటుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులపై నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పరిమితిని 74 నుంచి వంద శాతానికి పెంచుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడాన్ని నిరసిస్తూ స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద బీమా ఉద్యోగులు ఏజెంట్లతో కలిసి మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ ప్రతిపాదనలు దేశ ఆర్థిక స్వావలంబనకు విరుద్ధమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బీమా రంగాన్ని విదేశీ పెట్టుబడీదారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రజలను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియంపై ప్రస్తుతం వసూలు చేస్తున్న జిఎస్‌టినీ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలకొల్లు ఏజెంట్ల సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ, కార్యదర్శి సురేంద్రన్, నాయకులు నాళం బాపిరాజు, కురియ నల్లింటన్ మాట్లాడారు.



నిరసన తెలుపుతున్న బీమా ఉద్యోగులు, ఏజెంట్లు

భీమవరంలోనే జిల్లా కలెక్టరేట్

ఎంఎల్ఎ రామాంజనేయులు స్పష్టం

ఎంఎల్ఎకు వినతి అందించిన అఖిలపక్షం, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ స్థలం మార్పుపై జరుగుతున్న ప్రచారంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుందని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాల నేతలు ఎంఎల్ఎను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కలెక్టరేట్ స్థల మార్పుపై జరుగుతున్న ప్రచారంపై ప్రజలు ఆందోళనకు గురయ్యారన్నారు. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలు కలుపుకుని అఖిలపక్షంతో గత నెల 31న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఎంఎల్ఎను కలిశామన్నారు. ప్రజలకు అనువుగా ఉన్న స్థలంలోనే కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరామని చెప్పారు. దీనిపై ఎంఎల్ఎ రామాంజనేయులు మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రజలందరికీ అనువుగా ఉన్న ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తామని, త్వరలోనే జిల్లా కలెక్టర్‌తో కలిసి స్థలాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మార్కెట్ యార్డులోనే చూస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, నాయకులు చెల్లబోయిన రంగారావు, వైసిపి పట్టణాధ్యక్షులు రామరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, ఎంసిపిఐ (యు) నాయకులు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు లంకా కృష్ణమూర్తి పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం ప్రజా సంఘాల నేతలు

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

అడిషనల్ ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా ప్రతిఒక్కరూ పాటించాలని జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలు-2025లో భాగంగా జిల్లా పోలీసు, రవాణా శాఖ సంయుక్తంగా సుమారు 250 మంది ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లతో మంగళవారం పట్టణంలోని భాష్యం స్కూల్ వద్ద నుండి మార్కెట్ యార్డ్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం భారం కాదని, అది మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి డి.ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ వి.నారాయణమూర్తి, భీమవరం వన్‌టౌన్ సిఐ ఎం.నాగరాజు, టూటౌన్ సిఐ కాళీచరణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న జిల్లా అడిషనల్ ఎస్‌పి భీమారావు

కేన్సర్‌ను సకాలంలో గుర్తించాలి

ర్యాలీలో డిఎంహెచ్ఒ బి.భానునాయక్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేన్సర్ అంటే అపోహ వద్దని, కేన్సర్‌ను గుర్తిస్తే 90 శాతం వరకు ట్రీట్‌మెంట్ ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.భానునాయక్ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కేన్సర్‌పై విజయం-స్క్రీనింగ్‌తో సాధ్యం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. భానునాయక్ మాట్లాడుతూ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకుని మెరుగైన వైద్యం తీసుకుంటే కేన్సర్‌ను జయించవచ్చని అన్నారు. అన్ని రకాల కేన్సర్‌లకు చికిత్స ఉందని, ఎటువంటి అపోహలు వద్దని స్పష్టం చేశారు. ముందుగా గుర్తిస్తే 90 శాతం వరకు ట్రీట్‌మెంట్ చేయవచ్చన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే కేన్సర్‌ను దూరం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్‌సిడి డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి, జిల్లా ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కీర్తికిరణ్, జిల్లా ఎపిడిమోలాజిస్ట్ జి.సుభాష్, చెరుకువాడ రంగసాయి, డిప్యూటీ డెమో అనంతలక్ష్మి, వివిఎస్ఆర్‌కె.కుమారి, అర్బన్ పిహెచ్‌సి వైద్యులు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



త్రిశూల్ పోస్టర్ విడుదల చేస్తున్న కళాశాల డైరెక్టర్ జగపతి రాజు

15న ఎస్ఆర్‌కెఆర్‌లో త్రిశూల్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 15న ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా ప్రతియేటా నిర్వహిస్తున్న విద్యార్థి ఉత్సవం 'త్రిశూల్-2025' నిర్వహి స్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు విడుదల చేశారు. ఈ విద్యార్థి ఉత్సవాన్ని కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, ఎస్ఆర్‌కెఆర్ ఈవెంట్ ఆర్గనైజింగ్ సెల్ (ఇఒసి) సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణరాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.హరిమోహన్ తెలిపారు. ఈ విద్యార్థి ఉత్సవంలో ప్రధానంగా సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో వివిధ రకాల పోటీలు, వినోదాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు సహకరించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధం అమలుకు సహకరించాలని, ఉల్లంఘనకు పాల్పడే వారికి జరిమానాతోపాటు నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధర్‌రావు, ఎంఇఒ వేంద్ర వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి స్టీల్ సామగ్రి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడి రోడ్లపై, కాల్వల్లో వేయడం వల్ల జంతువులకు, ప్రజలకు, వాతావరణానికి తీవ్ర హాని వాటిల్లుతోందని, కేన్సర్‌కు కారణమవుతోందని అన్నారు. మంగళవారం ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, వాటర్ బాటిల్స్‌కు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అమలు చేస్తే మార్పు అనేది దానంతట అదే వస్తుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి స్టీల్ సామగ్రిని అందించారు. కార్యక్రమంలో అధికారులు జెవి.నాగేశ్వరరావు, వివై.శ్రీనివాసరావు, ఎన్.రమేష్‌నాయుడు, బి.శ్రీనివాసరావు, ఎస్.గంగావతి, ఎమ్‌డి.బేగం, డి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలానికి పంగనామం..!

- గొల్లలకోడేరులో ప్రభుత్వ స్థలంలో పెట్రోల్ బంకుకు రంగం సిద్ధం
- రూ.5 కోట్లు విలువ చేసే 36 సెంట్ల భూమిపై పెద్దల కన్ను
- భారీగా చేతులు మారిన ముడుపులు
- రెవెన్యూ, పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - భీమవరం

సహజంగా ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ అధికారులు రక్షిస్తూ ఉంటారు. అయితే పాలకోడేరు అధికారులు మాత్రం దీనికి పూర్తి విరుద్ధం. కాసులిస్తే చాలు స్థలం ఏదైనా నిబంధనలు ఎన్నున్నా అవేమీ పట్టించుకోరు. అడ్డగోలుగా తీర్మానాలు.. అనుమతులు ఇచ్చేస్తారు. గొల్లలకోడేరులో పెట్రోల్ బంకు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలమిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక అందించడమే దీనికి నిదర్శనం. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సుమారు రూ.5 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడింది.

భీమవరం-తాడేపల్లిగూడెం రహదారిలో గొల్లలకోడేరు వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని పాలకోడేరుకు చెందిన సర్వే నెంబర్.4లో 61 సెంట్లు ప్రభుత్వ, ప్రయివేటు భూమి ఉంది. దీనిలో ప్రయివేట్ వ్యక్తికి సుమారు 24 సెంట్లు స్థలం ఉంది. దీనికి ఇరువైపులా ఇరిగేషన్, ఆర్అండ్‌బి శాఖలకు చెందిన సుమారు 36 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్లు ఇటీవల సర్వే నిర్వహించి అధికారులు కూడా నిర్ధారించారు. ఈ భూమి ఖరీదు అక్షరాల సుమారు రూ.5 కోట్లు పలుకుతుందని అంచనా. అయితే ఈ ప్రభుత్వ స్థలం మధ్యభాగంలోని 24 సెంట్లు భూమిలో పెట్రోల్ బంక్ నిర్మాణనికి అధికారులు అనుమతులిచ్చారు. వాస్తవానికి పెట్రోల్ బంక్ నిర్మాణానికి 24 సెంట్లు స్థలం సరిపోదు. పాలకోడేరు పంచాయతీ పాలకవర్గ సభ్యులు దీని నిర్మాణానికి అడ్డు చెప్పినప్పటికీ అడ్డగోలుగా అధికారులు పంచాయతీ తీర్మానం చేసి నో అబ్జెక్షన్ కూడా ఇచ్చేశారు. దీన్ని ఆసరాగా చేసుకున్న రెవెన్యూ అధికారులు కూడా పెట్రోల్ బంక్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది.

పదేళ్ల క్రితం ప్రభుత్వ స్థలానికి రక్షణగా నిలిచిన తహశీల్దార్లు

సుమారు పదేళ్ల క్రితం ఈ ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతానికి గురవుతున్న నేపథ్యంలో అప్పటి తహశీల్దారులు ప్రభుత్వ స్థలానికి రక్షణగా నిలిచారు. అప్పటి గొల్లలకోడేరు సర్పంచి పెచ్చెట్టి సుబ్రహ్మణ్యం చొరవతో తహశీల్దార్‌లు చవాకుల ప్రసాద్, గంజి రత్నమణి ప్రభుత్వ స్థలాన్ని రక్షించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి సరిహద్దు రాళ్లు నిర్ణయించారు. ప్రస్తుతం ఆ రాళ్లు కన్పించకుండా పోయాయి. ఇటీవల నిర్వహించిన సర్వేలో కూడా ప్రభుత్వ స్థలం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.


గొల్లలకోడేరులో పెట్రోల్ బంకు నిర్మాణం చేసే స్థలం ఇదే

చుట్టూ ప్రభుత్వ స్థలమున్నా అనుమతులు ఎలా..!

పెట్రోల్ బంకు నిర్మించే స్థలం ఇరువైపులా ప్రభుత్వ స్థలం ఉంది. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకుకు వెళ్లేందుకు మార్గం లేదు. ప్రభుత్వ స్థలంలో నుంచి వెళ్లాల్సి ఉంది. అయితే పెట్రోల్ బంకు సంబంధించిన స్థలం కొంతమేర ఉన్నప్పటికీ అది ఏ విధంగాను అనువైంది కాదు. మరి రెవెన్యూ అధికారులు ఏ విధంగా అనుమతులకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారనేది చర్చనీయాంశమైంది.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భీమవరం ఆర్‌డిఒ

పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించిన ఫైల్ నా దగ్గరకు వచ్చింది. దీనిని పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వ స్థలం ఉన్నట్లయితే దానిని రక్షిస్తాం. నిబంధనలు పాటించకపోతే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

సమన్వయంతో విజయం సాధిస్తాం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సమన్వయంతో పని చేసి పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బివి.రాజు కళాశాలలో టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్ర ఓటర్లను కలిసి ఎన్‌డిఎ ప్రభుత్వ పనితీరు వివరించి ప్రచారం సాగించాలన్నారు. నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల జాబితాలోని ప్రతి 30 మంది ఓటర్లకు కూటమి ప్రతినిధిని నియమించి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కన్స్యూమర్ ప్రొటెక్షన్ సెల్ ఛైర్మన్ పీతల సుజాత, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజుసూరి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, టిడిపి నేతలు మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు: కూటమి పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు ఖాయమైనా మంచి మెజార్టీతో గెలిపించుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర (అనకాపల్లి) అన్నారు. పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కూటమి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, తులా రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలో టిష్యూ ఇంజినీరింగ్ పాత్ర కీలకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆధునిక శస్త్ర చికిత్స విధానంలో టిష్యూ ఇంజినీరింగ్ పాత్ర ఎంతో కీలకమైందని సైటెల్ ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు చేతన్ గౌడ్ తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని బయోటెక్నాలజీ ఇంజినీరింగ్ అసోసియేషన్ సహకారంతో బయో ప్రింటింగ్ అండ్ టిష్యూ ఇంజినీరింగ్ అంశంపై విద్యార్థులకు మంగళవారం సెమినార్ నిర్వహించారు. చేతన్ గౌడ్ సైటెల్ ల్యాబ్ బయో ఇంజినీర్ రోషన్ వ్యాస్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ శరీరంలో దెబ్బతిన్న జీవకణజాలాల పనితీరును పునరుద్ధరించడానికి, వాటి ఉత్పత్తిని మెరుగుపరచడానికి టిష్యూ ఇంజినీరింగ్ పద్ధతి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎవరికైనా కిడ్నీలు, కళ్లు, గుండెకు సంబంధించి ఏదైనా సమస్యలుంటే, ఆయా శరీర అవయవాల స్థానంలో కొత్తగా వాటిని తీసుకుని బయో ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ప్రయోగశాలలో కృత్రిమ పద్ధతిలో తయారుచేసి వాటిని అవయవాల స్థానంలో తిరిగి అమర్చుతారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవరికైనా ఎముకలు విరిగిపోతే వాటిని సిరామిక్స్ ద్వారా అతికించవచ్చన్నారు. ఈ నూతన సాంకేతిక సహాయంతో మరణాల సంఖ్యను తగ్గించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ టి.జగన్ మోహనరావు, డాక్టర్ వి.వందన కుమారి పాల్గొన్నారు.

10 నాటికి ఇ-పంట నమోదు పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - గణపవరం

పిప్పర రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఇ-పంట రికార్డులను జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 11,700 ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని చెప్పారు. వీటిలో 11,287 ఎకరాల పంటను ఇకెవైసి నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని 6,425 మంది రైతులు ఉండగా 2,184 మంది రైతులు ఇకెవైసి పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ వై.ప్రసాద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సన్న, చిన్న కారు రైతుల శ్రేయస్సే లక్ష్యం

ఉండి:సన్న, చిన్నకారు రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ఆక్వా రంగంలో బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ సుష్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలోని ఆక్వా రైతుల అసోసియేషన్ బిల్డింగ్‌లో ఆక్వా రైతులకు ఇన్సూరెన్స్ కార్యక్రమం ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సహ యోజనపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులు ఆక్వా రంగంలో వచ్చే నష్టాలకు కుదేలవ్వకుండా ఆక్వారంగానికి దూరమవ్వకుండా, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నాలుగు హెక్టార్లకు 40 శాతం ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ ఆక్వా రైతులందరూ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డిఎఫ్ఒ ఆర్‌విఎస్.ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో భీమవరం ఎడిఎఫ్ఎస్ వి.రాజా, ఎంఎఫ్ఒ రాంబాబు, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి

మొగల్తూరు:ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన సర్వే పారదర్శకంగా ఉండాలని డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి ప్రభాకరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుండి లబ్ధిపొందుతున్న లబ్ధిదారుల వివరాలను పక్కాగా సర్వే చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ, సిహెచ్ త్రిశూల పాణి, ఇఒపిఆర్‌డి పాల్గొన్నారు.

ఎల్‌బి చర్లలో 'పొలం పిలుస్తోంది'

నరసాపురం:మండలంలోని ఎల్‌బి.చర్ల, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిల్ కుమారి మాట్లాడుతూ రైతులు ఎక్కువగా పురుగు మందుల వాడకం వల్ల మేలు చేసే మిత్ర పురుగులు చనిపోయి పంటకు హాని కలిగే శత్రు పురుగులు బెడద ఎక్కువ అవుతుందని, దీంతో పంటకు హాని కలుగుతుందని తెలిపారు. రైతులు తెగుళ్లను బట్టి మాత్రమే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ అధికారి ఎం.సాముల్ జాన్సన్ మాట్లాడుతూ చాలామంది రైతులు కాంప్లెక్స్ ఎరువులను రెండు మూడు కోటాలలో వేస్తున్నారని, అలా వేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో విఎస్ఏ ఎ.వి.కృష్ణ, ఎఇఒ లక్ష్మీనారాయణ, వివిఎ సాయిదుర్గ, మర్రాజు, కె.సుబ్బారావు, నారాయణరావు పాల్గొన్నారు.

మార్చి 31 వరకూ సాగునీరు విడుదల

పెనుమంట్ర:రబీ పంటకు గాను మండలంలోని మార్టేరు పరిధిలోని నరసాపురం కాలువ ఆయకట్టుకు వంతుల వారీగా ఈ నెల ఒకటి నుంచి మార్చి 31వ తేదీ వరకూ సాగునీటిని సరఫరా చేయనున్నట్లు మార్టేరు ఇరిగేషన్ శాఖ గుబ్బల జయకాంత్ మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7, 14, 20, 27 తేదీల్లో, మార్చి 5, 12, 18, 25, 31వ తేదీల్లో నీటి సరఫరా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉంటుందని, ఆయకట్టు రైతులు ఆయా తేదీల్లో నీరు పెట్టుకోవాలని పేర్కొన్నారు.

'హలో బిసి.. చలో ఢిల్లీ'కి తరలిన నేతలు

పాలకొల్లు:'హలో బిసి.. చలో ఢిల్లీ' కార్యక్రమానికి పాలకొల్లు నియోజకవర్గ నుంచి మంగళవారం పలువురు బిసి నేతలు బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాల గణేష్ భవాని, జిల్లా అధ్యక్షులు కోడి యుగంధర్, ఈ నెల 6వ తేదీన న్యూఢిల్లీలోని ఏపి భవన్‌లో జరుగు ఒబిసి రిజర్వేషన్లపై చర్చ, రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి పట్టణ మహిళా అధ్యక్షురాలు సంతోషి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అంగర దేవకుమార్, బిసి నాయకులు బయలుదేరి వెళ్లారు.

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. స్థానిక అడ్డేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల దత్తత గ్రామమైన యాళ్ళవానిగరువు, ఆదిపాలెంలో రోడ్డుపై భద్రత, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు తదితర అంశాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ చీరల వేలం

మొగల్తూరు:ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ యాత్రికులు సమర్పించుకున్న చీరలు, రవికలకు సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణకుమార్ తెలిపారు. మొగల్తూరు గ్రూప్ దేవాలయాల ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన బల్ల సత్యనారాయణ రూ.3,40,000కు హెచ్చు పాడి పాటను సొంతం చేసుకున్నారని అరుణ్ కుమార్ తెలిపారు. వేలంపాట ద్వారా అమ్మవారికి ఆదాయం సమకూరిందని తెలిపారు. గత సంవత్సరం 2,03,500 రూపాయలు రాగా ఈ సారి వేలంపాటలో రూ.1,36,500 ఆదాయం పెరిగిందని ఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, దాసరి బాబీ, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

జీవ సంరక్షణ చర్యలతో వ్యాధుల నివారణ

తణుకు రూరల్: జీవ సంరక్షణ చర్యలు పాటించడం ద్వారా కోళ్లలో వ్యాధులను అదుపు చేయడానికి వీలవుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ వివరించారు. స్థానిక వి.వి.రావు కళ్యాణ మండపంలో పశు సంవర్ధకశాఖ అధికారులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పు వచ్చినప్పుడు వలస పక్షుల ద్వారా కోళ్లకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు ప్రధానంగా పాటించాల్సింది చనిపోయిన కోళ్లను గుంట తీసి సున్నంతో కలిపి పూడ్చివేయాలని, అలాకాకుండా సంచుల్లో కట్టి కాలువలో వేయడం రోడ్ల పక్కన వేయడం చేసినట్లయితే వ్యాధిని ఎప్పటికీ అరికట్టలేమన్నారు. ఈ వ్యాధి మనుషులకు సోకే అవకాశం లేదని కోళ్ల ఫారంలో పనిచేసే వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు పశువర్ధక శాఖ తాడేపల్లిగూడెం ఉపసంచాలకులు డాక్టర్ ఎల్‌కె.సుధాకర్, తణుకు ఉపసంచాలకులు ప్రసాద్, అత్తిలి అసిస్టెంట్ డైరెక్టర్ ప్రాంతీయ పశువైద్యశాల కెఎన్ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం

ఎంఇఒ-1 ఎ.రవీంద్ర

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులకు పదో తరగతి కీలకమని, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఎంఇఒ-1 ఎ.రవీంద్ర సూచించారు. మంగళవారం ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే దృక్పథంతో ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. గతం కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు ముందుకెళ్తున్నారన్నారు. ఉదయం, సాయంత్ర వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. పాఠాలు అర్థం కాకపోతే మరోసారి అడిగి తెలుసుకోవాలన్నారు .సైన్స్, మ్యాథ్స్ సిలబస్ ఎంతమేరకు పూర్తయ్యిందని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ జరగనున్నాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకూ పరీక్ష ఉంటుందని, భౌతిక, రసాయన శాస్త్రాలు ఒక్క పేపర్‌గా, జీవశాస్త్రం మరో పేపర్‌గా 50 మార్కుల చొప్పున నిర్వహిస్తారని, ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక తరగతిలో ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణరాజు, ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, ఎం.వెంకటేశ్వరరావు, టి. పెద్దింట్లు, సిఆర్‌పి ఎన్.అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



.ఏలూరుపాడు హైస్కూల్లో మాట్లాడుతున్న ఎంఇఒ-1 రవీంద్ర

పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కవిటం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. స్కూల్ పరిసరాలను పరిశీలించారు. ఇంకా రుచికరంగా పదార్థాలు తయారు చేయాలని ఏజెన్సీకి సూచించారు. పరిశుభ్రత పాటించాలని హైస్కూల్ హెచ్ఎంకు తెలిపారు. తహశీల్దార్ వెంట సిబ్బంది ఉన్నారు.

నేడు డిగ్రీ కాలేజీలో ఓపెన్ డే

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలాకుమారి మాట్లాడుతూ కాలేజీలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్, చాణక్య కాలేజీ విద్యార్థులు, ప్రిన్సిపల్, సిబ్బంది గణపవరం చుట్టు పక్కల గ్రామాల్లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలు తెలిపారు.

నేటితో ముగుస్తున్న దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్లుగీత కులాలకు సంబంధించి 5 షాపులు కేటాయింపునకు దరఖాస్తు గడువు ఈనెల 5వ తేదీతో ముగుస్తున్నట్లు తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. గత నెల 27 నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. తణుకు మున్సిపాల్టీ పరిధిలో శెట్టిబలిజకు, తణుకు రూరల్ మండలంలో శెట్టిబలిజకు ఇరగవరం మండలంలో గౌడకు , పెనుమంట్ర మండలంలో గౌడకు , పెనుగొండ మండలంలో శెట్టిబలిజ సామాజిక తరగతుల వారికి రిజర్వు చేసినట్లు తెలిపారు. ఒక వ్యక్తి జిల్లాలో ఎన్ని షాపులకైనా, ఎన్ని దరఖాస్తులు అయినా దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. అయితే ఒకవ్యక్తికి ఒక షాపు మాత్రమే కేటాయిస్తారన్నారు. లాటరీలో ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ షాపులకు సెలెక్ట్ అయినట్లయితే అతని కోరిక మేరకు కోరిన షాపును కేటాయించి అతనికి తగిలిన ఇతర షాపులను ఇతరులకు కేటాయిస్తారని తెలిపారు. ఒక్కో అప్లికేషన్ ఫీజు రూ.2,00,000 అని తెలిపారు. దరఖాస్తు సమర్పించు విధానంపై అవగాహన లేనిపక్షంలో తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అదనపు వివరాల కోసం 9440902436, 9490874538 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లేబర్ కోడ్లు రద్దు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని ఈనెల 5వ తేదీ బుధవారం జరగబోయే దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 39వ వార్షికోత్సవం అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ చుక్కా అప్పలస్వామి భవనం ఎదురు గ్రౌండ్‌లో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. అపరాల మార్కెట్ సీనియర్ నాయకులు ద్వారంపూడి అప్పిరెడ్డి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. 2024వ సంవత్సరం కార్యకలాపాల రిపోర్టును కార్యదర్శి నర్మాల నారాయణరావు ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, బుధవారం జరగబోయే దేశ వ్యాప్తి నిరసనలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించడం దుర్మార్గమని విమర్శించారు. కార్మిక చట్టాలను కార్పొరేట్లకు చుట్టాలుగా మార్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దారుణమని విమర్శించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కరెడ్ల రామకృష్ణ, ప్రెసిడెంట్‌గా చిటికిన రాము, వైస్ ప్రెసిడెంట్‌గా, అయినాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అడపా లోవ, కోశాధికారిగా యడ్ల శ్రీను, కమిటీ సభ్యులుగా దాసరి రాజు, సుందరపు అప్పలనాయుడు, వెదుళ్ల రమణారావు, ఇల్ల గోవిందరావు, బద్ది నాగేశ్వరరావు, పెంటకోట గోవిందు, చిట్టేటి సత్యనారాయణ, బుద్దాల తాతారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి సిరపరపు రంగారావు, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, జవ్వాది శ్రీను, గొర్రెల సతీష్ కుమార్, నరమాల కృష్ణ, దేశంశెట్టి సతీష్, కుంచంగి నానాజీ, పులిమంతుల రమణ, సిరపరపు రామారావు తదితరులు హాజరయ్యారు.

భీమవరం టౌన్ : కార్మిక హక్కుల్ని కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5వ తేదీన భీమవరంలో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వెంప గ్రామంలో పంచాయతీ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపుమేరకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక హక్కుల్ని కాల్ రాసే విధంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కోరుతూ భీమవరంలో జరిగే నిరసన ప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కడిమి పౌల్ రాజు, చిలకపాటి పౌలు పాల్గొన్నారు.

తణుకు:మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీన జరిగే ర్యాలీ, నిరసన కార్యక్రమాల్లో ఉద్యోగ, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో సిఐటియు మండల సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దు చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. కార్మికవర్గం ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న వాటిని 4 లేబర్ కోడ్స్‌గా మార్చడం ఏంటని ప్రశ్నించారు. 5వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నరేంద్ర సెంటర్‌లో జరిగే నిరసన, ధర్నా జరుగుతుందని, కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో గుబ్బల గోపి, గార రంగారావు, శేషకుమారి, నాసరి రత్నం, బంగారమ్మ, అంబటి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

6న పిడిఎస్ రైస్ బహిరంగ వేలం : జెసి

భీమవరం :జిల్లాలో నిల్వ ఉన్న 48.330 మెట్రిక్ టన్నుల పిడిఎస్ రైస్‌ను ఈ నెల 6న బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. వివిధ 6ఎ కేసులలో సీజ్ చేసిన 48.330 మెట్రిక్ టన్నుల ప్రజా పంపిణీ బియ్యాన్ని జిల్లాలోని ఉండి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిల్వ చేయడం జరిగిందన్నారు. విచారణ అనంతరం 6ఎ కేసులు ముగియడంతో సీజ్ చేసిన ప్రజా పంపిణీ బియ్యాన్ని కిలో ఒక్కింటికి రూ.20 చొప్పున ధర నిర్ణయించి బహిరంగ వేలం ద్వారా అమ్మకానికి ఉంచడం జరిగిందని తెలిపారు. 6వ తేదీ ఉదయం 11 గంటలకు ఉండి ఎం ఎల్ ఎస్ పాయింట్ వద్ద బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారలు జిఎస్‌టి లైసెన్స్ కలిగి ముందుగా రూ.5 వేలు ధరావత్తు సొమ్మును చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

యలమంచిలి:ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, మేడపాడు పిహెచ్‌సి వద్ద మంగళవారం ఆశా డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా దేవ సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సూర్యవతి, సంధ్య మహాలక్ష్మి, నాగదుర్గ, లక్ష్మీ కుమారి, శ్రీవర్ధిని, సుజాత పాల్గొన్నారు,

అరకొర బడ్జెట్‌తో వ్యవసాయ రంగం కుందేలు

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబూరావు, ప్రధాన కార్యదర్శి హరే రామ్

భీమవరం :పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఎటువంటి ఉపయోగమూ లేదని, అరకొర నిధులతో వ్యవసాయ రంగం మరింత కుదేలవుతోందని జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5వ తేదీన నిర్వహించబోయే బడ్జెట్ కాపీలను దహనం కార్యక్రమంలో రైతుల పాల్గొనాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో 60 శాతం మందికిపైగా ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అలాంటి వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని ఈ బడ్జెట్ గుర్తించలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు పెంచాల్సింది పోయి నిర్వాసితులను నిర్లక్ష్యం చేశారన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు, వెనుకబడిన జిల్లాలు ఆర్థిక సహకారానికై నిధులు కేటాయింపులోనూ, రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలోనూ ప్రత్యేక నిధులు కేటాయింపు జరగలేదన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి : కలెక్టర్

భీమవరం :ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లో నులిపురుగుల నిర్మూలనా వాల్‌పోస్టర్‌ను కలెక్టరు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో 10న అంగన్వాడీ, పాఠశాలలు, కళాశాలల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల పిల్లలు నీరసంగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదలకు ఆటంకంగా ఉంటుందన్నారు. జిల్లాలో 3 లక్షల 61 వేల 272 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల సురక్ష కో-ఆర్డినేటర్ బి.భావన, ఇన్‌ఛార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.భానునాయక్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో చేయూతనివ్వాలని 1ఎం1బి ప్రతినిధులకు కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ 1ఎం1బి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలోని యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యతను చేపట్టాలని సూచించారు. 1ఎం1బి సంస్థ డైరెక్టర్ అభిరామ్ మాట్లాడుతూ స్కిల్ అండ్ జాబ్ రెడీనెస్ కోసం తమ సంస్థ పనిచేస్తుందన్నారు.

జిల్లాలో విపత్తులను ఎదుర్కోవడానికి వినూత్న సమాచారాన్ని క్రోడీకరించి నివేదికను సమర్పించాలని సిఐఐ ప్రతినిధులకు కలెక్టర్ నాగరాణి సూచించారు. జిల్లాలోని వాతావరణ మార్పులు, చేపట్టాల్సిన చర్యలు వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి మంగళవారం జిల్లాకు వచ్చిన సిఐఐ బృందం తొలుత కలెక్టర్ నాగరాణితో సమావేశమై చర్చించారు. సమావేశంలో న్యూఢిల్లీ సిఐఐ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ స్వాతి సులగన, డిప్యూటీ డైరెక్టర్ జెస్సే ఎ.ఇనపర్తి, జిసిఆర్ఎస్ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పనికి వెళ్తున్నానని చెప్పి..

నరసాపురం:పనికి అని చెప్పి వెళ్లిన వ్యక్తి కాలువలో శవమై తేలిన ఘటన నరసాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణంలోని 1వ వార్డు శ్రీహరిపేటకు చెందిన పున్నాని రమేష్ (45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే రమేష్ సోమవారం ఉదయం ఇంటి నుండి పనికి అని వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు, స్థానికులు గాలించగా రమేష్ చెప్పులు ఇంటి సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న నరసాపురం-నిడదవోలు ప్రధాన కాలువ వద్ద ఉన్నాయి. అనుమానం వచ్చి అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు గాలించగా శవమై కనిపించాడు. మృతుడు తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగిఉండాలి

ప్రజాశక్తి - కాళ్ల

పొగాకు ఉత్పత్తులు ఎక్కువగా వాడడం, బయట ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, ఒకసారి వాడిన వంట నూనె, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వాడడం వల్ల కేన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని కాళ్ల పిహెచ్‌సి వైద్యాధికారి సరాబు సునీల్ అన్నారు. కాళ్లలో మంగళవారం వైద్యాధికారి సరాబు సునీల్ అధ్యక్షతన ప్రపంచ కేన్సర్ దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో సరాబు సునీల్ మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఎన్‌సిడిసిడి 3.0 సర్వే చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆశ డే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్తమ వైద్యాధికారి అవార్డును పొందిన డాక్టర్ సరాబు సునీల్‌ను వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డి.సునీత, టి.భావన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : కేన్సర్ కారకాలు, నివారణ వాటిని గుర్తించే విధానం అందుకు అవసరమైన చికిత్స వంటి అంశాలపై ప్రజలందరికీ గుర్తించే విధానాన్ని అవగాహన కల్పించడమే ప్రపంచ కేన్సర్ దినోత్సవం లక్ష్యమని దుంపగడప వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత వివరించారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మద్యం, ధూమపానం వంటి వాటిని నిషేధించడం, ఆహార సమతౌల్యత పాటించడం, నిత్యం వ్యాయామం చేయడం వంటి వాటి ద్వారా ఈ వ్యాధి బారినపడకుండా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు గ్రామంలో కేన్సర్ వ్యాధి నివారణ ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు.

గణపవరం : పిఎంపిల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సరిపల్లి సాయిబాబా మందిరంలో కేన్సర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. సదస్సులో పాల్గొన్న తల్లీపిల్లల ఆసుపత్రి డాక్టర్ పి.అవినాష్ ఎ.ఆశాదీప్తి మాట్లాడుతూ ఆడపిల్లలందరు వాక్సిన్ తీసుకోవాలని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి విటిబి.రాజు మాట్లాడుడారు. ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర గౌరవ సలహాదారులు ఎన్.జయసూర్య మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వి.శివ శ్రీనివాసరావు, కోశాధికారి కొటకల అప్పారావు, ఇసి సభ్యులు గణేష్, పానాకాలు, జి.శ్రీను పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్:లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ఆషాడే కార్యక్రమంలో ఎఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు, హెల్త్ అసిస్టెంట్లకు, ఆశా కార్యకర్తలకు ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సేవలందించడంలో ఏ విధమైన సమస్యలున్నా తమ దృష్టికి తేవాలన్నారు. జనరల్ వైద్య నిపుణులు కెవైఎన్ వర్మ మాట్లాడారు. అనంతరం ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : కేన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే కేన్సర్‌ను సులభంగా తమ్మి కొట్టొచ్చని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యుడు సిహెచ్‌వి రంగం నాయుడు అన్నారు. పాలకోడేరు పిహెచ్‌సి వద్ద కేన్సర్‌పై అవగాహనా ర్యాలీని మంగళవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కేన్సర్‌పై అవగాహన ఉండాలన్నారు. సిహెచ్‌ఒ సత్యనారాయణ, పిహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, అమ్మాజీ పాల్గొన్నారు.

పిఎసి ఛైర్మన్‌గా అంజిబాబు

భీమవరం టౌన్:రాష్ట్ర శాసన వ్యవస్థ పిఎసి ఛైర్మన్‌గా ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఎన్నికయ్యారు. శాసనసభ ప్రతి అయ్యన్నపాత్రుడు మంగళవారం అంజిబాబును ప్రభుత్వ లెక్కల సమితి నాయకుడిగా నియమించారు. గతంలో పిఎసి ఛైర్మన్‌గా అంజి బాబును ప్రకటించిన విషయం విజేతమే, దీంతో కూటమి నాయకులు, నియోజవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7న క్యాంపస్ ఇంటర్వ్యూలు

పెనుమంట్ర:మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో ఈనెల 7వ తేదీన వ్యవసాయ డిగ్రీ లేదా డిప్లొమా చేసిన వారి కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పరిశోధనా సహ సంచాలకులు టి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన డిబుల్ అగ్రి సైన్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ ద్వారా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరులో ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు వ్యవసాయ విద్యలో పట్టభద్రులు, వ్యవసాయ డిప్లొమా చేసినవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.1.8 లక్షల నుంచి రూ.2.0 లక్షల వేతనం ఉంటుందని అదనంగా డిఎ, హెచ్‌ఆర్‌ఎ, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మాటేరులో నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఈ వెంట్‌కు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

పదిలో విద్యార్థులు విజయం సాధించాలి : ఎంఇఒ

గణపవరం:పది పరీక్షల్లో ప్రతి విద్యార్థీ విజయం సాధించాలని గణపవరం విద్యాశాఖాధికారి కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. మంగళవారం మానవత ఆధ్వర్యంలో కాశిపాడు, పిప్పర జెపి హైస్కూల్ విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. గోపాలశర్మ మాట్లాడుతూ పది విద్యార్థులు పరీక్షలకు భయపడకూడదన్నారు. అనంతరం తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల ను అందజేశారు. మానవత నాయకులు కె.వినాయక, పి.హరికుమార్‌రాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు వడ్డీ లేని రుణాలివ్వాలి

తణుకు:బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు ఆటో కార్మికులకు ఇవ్వాలని సిఐటియు నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో ఆటో యూనియన్ సర్వసభ్య సమావేశం నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఆటోలను నడుపుకుంటూ సుమారు 5 లక్షల మంది రాష్ట్రంలో జీవిస్తున్నారన్నారు. అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. రవాణా రంగంలో ఆటో ద్వారా ప్రజలకు సేవ చేస్తున్న ఆటో కార్మికుల ను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పెగిగిన స్పేర్ పార్ట్స్ ధరలను తగ్గించాలని, కార్మికులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.